# బీఆర్‌ఎస్‌దే హవా

## గెలుపు ధీమాలో శ్రేణులు

- నెల రోజులుగా హోరెత్తిన ప్రచారం
- సీట్లు ఖరారు నుంచే రంగంలోకి గులాబీ అభ్యర్థులు
- మూడు నెలల నుంచి ప్రజలతో మమేకం
- చేసిన అభివృద్ధి.. చేయబోయే పనులను వివరిస్తూ ఓట్ల అభ్యర్థన
- అధినేత ప్రజా ఆశీర్వాద సభలతో ఫుల్ జోష్ • ప్రసంగాలతో ఆలోచన రేకెత్తించిన సీఎం కేసీఆర్ • కరెంట్, ధరణి, ఓటు హక్కు వినియోగంపై జోరుగా చర్చ • ముఖ్యమంత్రి హామీలపై సంపూర్ణ విశ్వాసం
- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలతో ఉత్సాహం
- సకల జనుల నుంచీ పెరిగిన మద్దతు
- ముగిసిన ప్రచారం.. ఆఖరి రోజూ హోరాహోరు
- వేలాది మందితో రోడ్‌షో.. ర్యాలీలు

బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్లారు. సిరిసిల్ల, వేములవాడ అభ్యర్థులు కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావుతోపాటు జిల్లా పరిధిలోకి వచ్చే మానకొండూర్, చొప్పదండి అభ్యర్థులుగా రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్‌ను బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 21న ప్రకటించగా, అప్పటి నుంచే వారు రంగంలోకి దిగారు. మిగతా పార్టీలు అభ్యర్థులను ప్రకటించక ముందే నియోజకవర్గాలను చుట్టి వచ్చారు. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే నాటికే గడపగడపనూ తట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు, స్వరాష్ట్రంలో సాధించిన విజయాలను కండ్ల ముందుంచారు. గడిచిన తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూనే.. తాము గెలిస్తే చేయబోయే పనుల ప్రణాళిక, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి మద్దతు కూడగట్టారు.

-రాజన్న సిరిసిల్ల, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ)

రాజన్న సిరిసిల్ల (నమస్తేతెలంగాణ) నవంబర్ 28: బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరపున అధినేత కేసీఆర్ ప్రచారాన్ని హోరెత్తించారు. గత నెల 17న సిరిసిల్ల, ఈ నెల 26న వేములవాడ, ఈ నెల 17న చొప్పదండి, ఈ నెల 20న మానకొండూర్‌లో ప్రజా ఆశీర్వాద సభలకు హాజరై ప్రజలను చైతన్యం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు, ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయం, స్వరాష్ట్రంలో సాధించిన విజయాలను వివరించారు. ఇక్కడ చేసిన ఉద్యమాలను గుర్తు చేశారు. ఉద్యమ సమయంలోనే ఈ ప్రాంత సమస్యలన్నింటినీ గుర్తించి, అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిన తీరును కండ్ల ముందుంచారు. 24గంటల కరెంట్, ధరణి, రైతుబంధుపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలు, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను తెలియజేశారు. అందరి భవిష్యత్తును నిర్ణయించేది ఈ ఓటేనని, విచక్షణతో ఓటు వేయాలని, అభ్యర్థులు.. వారి వెనక ఉన్న పార్టీలను చూడాలని, ఆగం కావొద్దని సూచించారు. గులాబీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే.. కలికోటచెరువు నింపే పథకం మంజూరు చేసి, పూర్తి చేసే బాధ్యత తనదేనని హామీఇచ్చారు. అలాగే వేములవాడ, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించి ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశారు.

అలాగే ఈ నెల 15న వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా మంత్రి కేటీఆర్ కథలాపూర్, చందుర్తిలో ప్రజా ఆశీర్వాద సభలు, కోనరావుపేట, రుద్రంగి, వేములవాడలో రోడ్‌షోలకు హాజరై, జోష్ నింపారు. అలాగే అమాత్యుడు రామన్న ఈనెల 15న తంగళ్లపల్లి, 20న ముస్తాబాద్, 26న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, 28న సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలు చేసిన ప్రసంగాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. అలాగే గత నెల 6న మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మద్దతుగా మంత్రి హరీశ్‌రావు ప్రచారం చేశారు. సెంటిమెంట్లకు, కన్నీళ్లకు కరిగిపోయి ఓటు వేయవద్దని.. ఓటమితో చావే మార్గమని చెప్పే వారికి ఓటు వేస్తే మనకే చావు తప్పదనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని సూచించారు. అయితే అధినేత కేసీఆర్, మంత్రి కేటీఆర్ చెప్పిన ప్రతి విషయంపైనా ప్రతి గ్రామంలోనూ ప్రజలు చర్చిస్తున్నారు. కాంగ్రెస్ ఓటేస్తే కరెంట్ ఆగమవుతుందని, ధరణి రద్దయి భూములకు భద్రత లేకుండా పోతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత పాలనలో పడ్డ కష్టాలు ఇంకా కండ్ల ముందే కనిపిస్తున్నాయని, తాము ఇంకా మరిచిపోలేదని నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి ముందుకు సాగుతుందని చెబుతున్నారు.

### కేటీఆర్ రోడ్‌షోలు సక్సెస్..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ రాష్ట్ర మంతటా చుట్టివచ్చారు. ఒక వైపు పార్టీని గెలిపించుకునే ప్రయత్నం, మరోవైపు తాను గెలువాలన్న లక్ష్యంతో అలుపెరుగకుండా పర్యటించారు. తన నియోజకవర్గంలోనూ ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండల కేంద్రాలతోపాటు సిరిసిల్లలో నిర్వహించిన రోడ్‌షోలు విజయవంతం అయ్యాయి. ఊహించిన విధంగా భారీ సంఖ్యలో జనం వచ్చి తమ అభిమాన నాయకుడి అపూర్వ స్వాగతం పలికారు. రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్ల గడ్డ రుణం తీర్చుకుంటానని, అభివృద్ధి, సంక్షేమంతో నియోజకవర్గ ప్రజలు తలఎత్తుకునేలా చేశానే తప్ప.. ఎక్కడ తాను తప్పు చేయలేదని స్పష్టం చేశారు. మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే రాష్ట్రంలోనే సిరిసిల్లను అగ్రస్థానంలో నిలుపుతానని రామన్న చెతుండగా, తమ మద్దతు మీకేనంటూ జనమంతా జేజేలు పలికారు. ఆపత్కాలంలో అండగా ఉండి ఆదుకున్న కేటీఆర్ వెంటే తామంటూ ఉన్నామంటూ ప్రజలంతా చెబుతున్నారు. ఎన్ని పార్టీలు వచ్చినా, ఎన్ని ఆశలు చూపినా లొంగే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు.



జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ రోడ్ షోకు భారీగా హాజరైన నాయకులు

### సిరిసిల్లలో రామన్న ధీమా

మంత్రి కేటీఆర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి పోటీ చేస్తున్న సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రచారం హోరెత్తింది. బీఆర్‌ఎస్‌తో ప్రధానంగా పోరాడుతున్న కాంగ్రెస్, బీజేపీల కంటే వినూత్న రీతిలో, రోడ్‌షోల ద్వారా అమాత్యుడు రామన్న ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో సిరిసిల్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపారు. తాను చేసిన అభివృద్ధి పనులను రోడ్‌షోల ద్వారా ఓటర్లకు వివరించారు. 'ఇంటింటికీ రావాలని ఉన్నదని, మీ అందరితో కలిసి మాట్లాడాలని ఉన్నదని.. కానీ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు ఉండడం వల్లే రాలేకపోతున్నానని చెప్పారు. చేసిన అభివృద్ధి మీ కండ్ల ముందే ఉన్నదని.. మరోసారి అవకాశం ఇస్తే వందేండ్లపాటు చెప్పుకొనే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని అభ్యర్థించారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించి.. చట్టసభల్లో అడుగుపెట్టే అశకాశం కల్పించారు. నా చర్మం ఒలిచి మీకు చెప్పులు కుట్టించినా మీ రుణం తీర్చుకోలేనని' తన నియోజకవర్గంలోనూ ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండల కేంద్రాలతోపాటు సిరిసిల్లలో నిర్వహించిన రోడ్‌షోలలో ఉద్వేగంతో ప్రసంగించారు. 'రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్ల గడ్డ రుణం తీర్చుకుంటానని, అభివృద్ధి, సంక్షేమంతో నియోజకవర్గ ప్రజలు తలఎత్తుకునేలా చేశానే తప్ప.. ఎక్కడ తాను తప్పు చేయలేదని' స్పష్టం చేశారు. తమ మద్దతు మీకేనంటూ సబ్బండవర్గా జనమంతా జేజేలు పలుకుతున్నారు.



### ప్రచారంలో మహారాష్ట్ర కార్యకర్తలు

ఎన్నికల ప్రచారంలో మహారాష్ట్ర నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు జిల్లాకు వచ్చారు. ముంబాయి, పూణే, షోలాపూర్, నాందేడ్ తదితర ప్రాంతాలలోని కార్యకర్తలంతా పెద్దసంఖ్యలో జిల్లాకు చేరుకున్నారు. జిల్లాకు చెందిన వారంతా వృత్తి, వ్యాపారరీత్యా అక్కడ స్థిరపడ్డారు. వారి కుటుంబ సభ్యులు, స్నేహితులను కలిసి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థులు కేటీఆర్, లక్ష్మీనరసింహారావును గెలిపించాలని ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాలలోని ప్రతి పల్లెకు పోయి ప్రచారం చేశారు. భీవండి పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎలిగేటి శ్రీనివాస్, ధర్న కనకయ్య, సిరిపురం తిరుపతి, తుమ్మ సుదర్శన్, కొండి మల్లేశం, వంగరి గోవర్ధన్, హీరామన్ కుర్వాడే, పరమేశ్వర్, ఎనగందుల జగన్, సంజు అంకం, జలాల్ శేఖ్ ఆధ్వర్యంలో సుమారు 500మంది మహారాష్ట్ర కార్యకర్తలంతా స్వచ్ఛందంగా పార్టీ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేశారు.



రోడ్‌షోకు హాజరైన మంత్రి కేటీఆర్‌కు అభివాదం చేస్తున్న పట్టణ ప్రజలు



### చివరి రోజూ ప్రచార హోరు

ప్రచారం చివరి రోజైన మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంతో హోరెత్తించారు. సిరిసిల్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. పట్టణంలోని కొత్త బస్టాండ్ తెలంగాణతల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ తీయగా, వేలాది మంది పాల్గొన్నారు. వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చల్మెడకు మద్దతు బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశారు. చొప్పదండిలోని పలు వార్డుల్లో సుంకె రవిశంకర్ ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి నుంచి మండలకేంద్రం వరకు 17 కిలోమీటర్ల దూరం రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు.



సిరిసిల్ల రోడ్‌షోలో దేఖ్‌లేంగె పాటపై స్టెప్పులేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, యువకులు

### చొప్పదండిలో 'సుంకె'కే అవకాశం

చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ప్రధానంగా పోటీ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ బీజేపీ నుంచి పోటీలో ఉన్నా అంతగా ప్రభావం కనిపించడం లేదు. త్రిముఖ పోటీ ఉంటుందని భావించినా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ మాత్రం తన గెలుపుపై ధీమాతో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన తన నియోజకవర్గాన్ని రూ.1,800 కోట్లతో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశానని ప్రజలకు వివరించగలిగారు. ఒకప్పుడు కరువు సీమగా ఉన్న చొప్పదండిని కోన సీమగా మార్చానని, తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరించగలిగానని ఓటర్లకు చెప్పగలిగారు. అంతే కాకుండా, బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కూడా నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ, చొప్పదండి పట్టణంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించి పలు హామీలు ఇచ్చారు. తన గెలుపునకు ఈ హామీలు దోహద పడతాయనే ధీమాలో రవిశంకర్ కనిపిస్తున్నారు. తాను ఒక్కడినే స్థానికుడినని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని రవిశంకర్ చేసిన ప్రచారం బాగా పనిచేసింది.



చొప్పదండి : మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్



వేములవాడ రూరల్ : మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

### పడిపోయిన ప్రతిపక్షాల గ్రాఫ్

బీఆర్‌ఎస్‌ను ఓడించాలనే లక్ష్యంతో ఈసారి ఎన్నికల బరిలోకి దిగిన ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీల గ్రాఫ్ క్రమంగా తగ్గిపోయింది. మొదట్లో బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో చాలా వ్యతిరేకత ఉన్నదని ఈ పార్టీల నాయకులు ఎవరి వారే ప్రచారం చేశారు. కానీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వంటి నాయకులు ప్రతి నియోజకవర్గంలో ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి సామాన్యులకు అర్థమయ్యే విధంగా వివరించారు. కరెంట్, ధరణిపై ప్రతిపక్ష కాంగ్రెస్ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టగలిగారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలోకి వస్తే జరిగే పరిణామాల గురించి ప్రజలకు వివరించగలిగారు. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగాలు జిల్లా ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు చేసింది ఏమీ లేదని చెబుతూనే పదేళ్లలో బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి సభలో కేసీఆర్ వివరించారు. ఓటర్లలో క్రమంగా మార్పునకు దోహద పడింది. బీఆర్‌ఎస్ గెలిస్తేనే తమ బతుకులు బాగు పడతాయని భావన ముఖ్యంగా కరెంట్ విషయంలో కాంగ్రెస్ రేపుతున్న గందరగోళ పరిస్థితిపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని, ధరణిని తొలగిస్తారనే విషయాలను రైతులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీల గ్రాఫ్ క్రమంగా తగ్గి బీఆర్‌ఎస్ గెలుపు బాట పట్టింది.

### ప్రచారంలో ముందువరుసలో చల్మెడ

వేములవాడ నియోజకవర్గంలోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రచారంలో దూసుకుపోయారు. విద్యా, వైద్య రంగాల్లో చేసిన సేవలతో ఆయన ప్రజలకు దగ్గరయ్యారు. ఎప్పుడు అందుబాటులో ఉండే ఆయన గెలుపు కోసం కార్యకర్తలు అహర్నిశలు కష్టపడ్డారు. ప్రచారంలో అందరి కంటే ముందువరసలో నిలిచారు. వేములవాడ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ రావడం, రాజన్న ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. కేసీఆర్‌పై ఉన్న నమ్మకం, రామన్నపై ఉన్న అభిమానంతో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలలోని ప్రజలంతా కారుకే మొగ్గు చూపుతున్నారు. రెండు నియోజకవర్గాలలో అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వేములవాడ రూరల్ : మండలంలో చల్మెడ ప్రచార ర్యాలీలో భారీగా పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు ➤



గన్నేరువరం: బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి రోడ్ షోకు భారీగా హాజరైన ప్రజలు



### హ్యాట్రిక్ దిశగా 'రసమయి'

మానకొండూర్ నియోజకవర్గంలో రెండు సార్లు ఘన విజయం సాధించిన రసమయి బాలకిషన్ హ్యాట్రిక్ విజయం వైపు అడుగులు వేస్తున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచే రసమయి బాలకిషన్ నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కూడా పెద్ద మొత్తంలో నిధులు తెచ్చారు. నిధులు మంజూరై ప్రారంభించని పనులు కూడా కోకొల్లలుగా ఉన్నాయి. ఈ విషయాలను రసమయి తనదైన శైలిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించగలిగారు. గత అక్టోబర్ 6న రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించి, రసమయిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పోటీలో ఉన్నా, ప్రధాన పోటీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే కనిపిస్తోంది. అయితే, గతంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ చేసిన అకృత్యాలను సభలు, సమావేశాల్లో రసమయి చక్కగా వివరిస్తూ వచ్చారు. దీనికితోడు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ తిమ్మాపూర్ వేదికగా జరిగిన బహిరంగ సభలో ఎస్సీ నియోజకవర్గమైన మానకొండూర్‌లో ఉన్న దళితులందరికీ ఒకేసారి దళితబంధు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని రసమయి గెలుపు కోసం నియోజకవర్గంలోని దళితవాడల్లోకి వెళ్లి బీఆర్‌ఎస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇది బాగా పనిచేసిందనే భావన రసమయిలో కనిపిస్తోంది. మొత్తానికి హ్యాట్రిక్ విజయం దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు.